సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 15 । జనవరి । 2023



కొలువుల సంక్రాంతి !



జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులు (ఫైల్)

- నిరుద్యోగులకు నోటిఫికేషన్ల పండుగ
- పుస్తకాలతో కుస్తీ పడుతున్న జిల్లా యువత

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సర్కారు కొలువుల నియామకాలతో నిరుద్యోగుల ఇంట సంక్రాంతి పండుగ కొత్త వెలుగులు నింపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం భారీగా నియామకాలు చేపట్టడంతో జిల్లాలో వేలాది మంది యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇటీవల పోలీసు, గ్రూప్స్, వైద్య, ఆరోగ్య శాఖలు, విద్యాశాఖ సంబంధించిన పోస్టులు వెలువడిన నేపథ్యంలో నిరుద్యోగులకు చాలా ఏళ్లకు పండుగ వాతావరణం నెలకొంది. జిల్లాలో వేలాది మంది అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పడుతూ కోచింగ్ సెంటర్లు, ఉచిత శిక్షణ తీసుకుంటున్నారు. పోలీసు ఉద్యోగాల కోసం ప్రిలిమ్స్, శారీరక సామర్థ్య పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో ఏప్రిల్‌లో తుది పరీక్ష జరుగనుంది. జిల్లాలో 461పోలీసు కానిస్టేబుల్ పోస్టులు, కాళేశ్వరం జోన్ పరిధిలో 33ఎస్సై పోస్టుల ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఇటీవల ఫిజికల్ ఈవెంట్స్‌కు 9,178మంది హాజరు కాగా, 4780మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. అభ్యర్థులు ఉద్యోగం సాధించేందుకు పోటీ పడుతున్నారు. ఇక గురుకుల, వైద్యారోగ్య శాఖ పోస్టులు, రవాణా శాఖ, హాస్టల్ వెల్ఫేర్, హార్టికల్చర్, వెటర్నరీ, వ్యవసాయ, విద్యుత్, న్యాయ శాఖ, పీఈడీ, జూనియర్ లెక్చరర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, గ్రూప్ 1నుంచి గ్రూప్ 4వరకు వరసగా నోటిఫికేషన్లు వెలువడడంతో నిరుద్యోగులకు పెద్ద ఊరట కలిగింది. తాజాగా గ్రూప్–1 ప్రిలిమినరీ ఫలితాలు విడుదలయ్యాయి. మెయిన్స్ వచ్చే జూన్‌లో జరగనుంది. ఈ నెలలోనే మిగతా గ్రూప్స్ పరీక్షల దరఖాస్తుల ప్రక్రియ మొదలు కానుంది. కనీస డిగ్రీ నుంచి సాంకేతిక, వృత్తివిద్యా కోర్సుల అర్హతతో కొలువులు ఉన్నాయి.

పోటీ అధికం.. కష్టపడితే ఫలితం

మునుపెన్నడూ లేనంతగా ఈసారి అభ్యర్థుల్లో పోటీ నెలకొంది. జోనల్ కేడర్ పోస్టులు కాళేశ్వరం జోను పరిధిలో, కొత్త జిల్లాల వారీగా నియామకాలు చేపడుతున్నప్పటికీ పోటీ విపరీతంగా ఉంది. గత నాలుగేళ్లుగా ఉద్యోగ నియామాకాలు జరగకపోవడంతో నిరుద్యోగులు ఎక్కువయ్యారు. 95శాతం లోకల్ కేటగిరీలో స్థానిక యువతీ, యువకులకే అవకాశం దక్కనుంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని గ్రంథాలాయంతోపాటు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లోని గ్రంథాలయాలు, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌తోపాటు స్థానికంగా ప్రభుత్వం, సింగరేణి, పోలీసు శాఖ ఇస్తున్న ఉచిత శిక్షణల్లోనూ యువతీ, యువకులు కోచింగ్ తీసుకుంటున్నారు. కష్టపడిచదివితే ఉద్యోగం పొందిన ఇంట సంక్రాంతి వెలుగులు నిండనున్నాయి.



మంచిర్యాలలో ఆసుపత్రి ఎదుట ముగ్గులు వేస్తున్న సిస్టర్స్



హమాలీవాడలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఊరూవాడ సందడి

- ముగ్గులతో మురిసిన నేలతల్లి
- సంబురంగా భోగి పండుగ
- సంక్రాంతి.. కనుమతో ముగింపు

మంచిర్యాలఅర్బన్: భోగభాగ్యాలు.. సిరిసంపదలు ఇచ్చే పండుగకు సంక్రాంతి ప్రసిద్ధి. గుమ్మాల్లో స్వాగతం పలికే రంగవల్లులు, చలికి దీటుగా ఎగిసిపడే భోగిమంటలు.. డూడూ బసవన్నల కోలాహలం జిల్లాలో నెలకొంది. శనివారం భోగిపండ్ల ఉత్స వం, భోగిమంటలు, బొమ్మల కొలువులతో ఇళ్లు కళకళలాడాయి. ఆకాశంలో ఎగిరే గాలిపటాలు.. ఇళ్ల ముందు గొబ్బెమ్మలు కనువిందు చేశాయి. రంగురంగుల కలలు నిజం కావాలని రంగవల్లులు ఆకాంక్షించాయి. భోగిమంటు వెచ్చని లక్ష్యాలను నిర్దేశించా యి. కట్టుబొట్టు సంస్కృతిని గుర్తు చేశాయి. భోగిమంటలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.

ఆకట్టుకున్న రంగవల్లులు


ధనుర్మాసం ప్రారంభం నుంచి రంగవల్లులను తీర్చిదిద్దారు. మహిళలు ఉత్సాహం చూపారు. మార్గశిర మాసంలో విష్ణుమూర్తిని ఆరాధించే ఇళ్లను పరిశీలించడానికి ప్రాతఃకాలంలో లక్ష్మీదేవి సంచరిస్తుందని పురణాలు చెబుతున్నాయి. ముగ్గులతో తీర్చిదిద్దిన గృహ ప్రాంగణంలోకి లక్ష్మీదేవి ప్రవేశిస్తుందనే నమ్మకంతో తెల్లవారేటప్పటికే ఇళ్లముందు రంగవల్లులు నేలపై మెరిశాయి.

సంక్రాంతి.. కనుమ..

నూతన వైభవలక్ష్మీ ఇంట తాండవమాడాలని భోగి పండుగను నిర్వహించారు. సంకుచిత భావాలకు స్వస్తి పలికి నూతనత్వానికి నాంది పలకాలనే ఆశయంతో పాత వస్తువులను వేసి భోగిమంటలు వెలిగించారు. ఇది పిల్లల పండుగగా ప్రసిద్ధి పొందినప్పటికీ చాలా చోట్ల వీధి వీధినా పిల్లలు, పెద్దలు గుమిగూడి భోగిమంటలు వేశారు. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి సంక్రమించే రోజు సంక్రాంతి. అజ్ఞానాంధకారంలోని మానవలోకానికి వెలుగులు నింపడానికి లోక బాంధవుడైన సూర్యుడిని ఆహ్వానించే సుదినం. కూష్మాండ, సువర్ణ, వస్త్రదానాలు కూడా చేస్తారు. సమాజానికి ప్రాణధారమైన తిండిగింజలను అందించడంలో ప్రముఖ పాత్ర పోషించే పశువులను దేవతా స్వరూపంగా భావించి కనుమ పండుగ నాడు వాటికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఎడ్లను శుభ్రంగా కడిగి పుసుపు కుంకుమలతో అలకరించి హారతులిస్తారు.



గౌతమినగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



వాడవాడలా గంగిరెద్దులతో విన్యాసాలు

న్యూస్‌రీల్

జెడ్పీ, స్థాయీ సంఘ సమావేశాలు

మంచిర్యాలటౌన్: ఈ నెల 25న మంచిర్యాల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, 30న జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కె.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ సమావేశం ఉదయం 10:30 గంటలకు, స్థాయీ సంఘాల సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

తడి, పొడి చెత్త నిర్వహణ-మన బాధ్యతపై పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఊరిలో తడి, పొడి చెత్త నిర్వహణ–మన బాధ్యత అనే అంశంపై పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 20నుంచి 23వరకు పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జనవరి 26న బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో–ఆర్డినేటర్ యోగేశ్వర్‌లను 83283 63596, 98492 54747 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి శ్రీనివాసలక్ష్మి రైస్‌మిల్లులో హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ సమాచారం మేరకు శ్రీనివాసలక్ష్మి రైస్‌మిల్లులో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అక్రమంగా నిల్వ ఉంచిన 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించగా కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం పంచనామా అనంతరం మండల స్టాక్ పాయింట్‌కు తరలించారు. తనిఖీల్లో గిర్దావర్ లావణ్య, హాజీపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ రుణం దక్కేదెవరికో..!

- మైనార్టీ కార్పొరేషన్ యూనిట్లకు భారీగా దరఖాస్తులు
- ఒక్కో యూనిట్‌కు 54మంది పోటీ

నెన్నెల: నిరుపేద మైనార్టీ వర్గాలకు అందించే రాయితీ రుణాలకు తీవ్ర పోటీ నెలకొంది. ఆరేళ్ల తర్వాత రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందికి రాయితీ రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలో కేటగిరీ– కింద రూ.లక్షకు 80శాతం కేటగిరీ–2 కింద రూ.2లక్షలకు 70శాతం రాయితీతో కూడిన రుణాలను అభ్యర్థులకు మంజూరు చేస్తారు. కేటగిరీ–1, 2 కలిపి జిల్లాకు 50 యూనిట్లు కేటాయించగా ఇప్పటి వరకు జిల్లాలోని మైనార్టీలు 2,709 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో యూనిట్‌కు 54 మంది పోటీ పడుతున్నారు. ఏళ్ల నుంచి జిల్లాలో రుణాల కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటే యూనిట్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇంతమందిలో ఎవరికి రుణం దక్కుతుందోనని, తక్కువ యూనిట్లు కేటాయించడంపై మైనార్టీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రుణం పొందాలంటే రణం తప్పదని, ఎక్కువ యూనిట్లు మంజూరు చేయాలని కోరుతున్నారు..

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు..

బెల్లంపల్లి మండలంలో 39, బెల్లంపల్లి(అర్బన్) 294, భీమారం 11, భీమిని 16, చెన్నూర్ 12, చెన్నూర్(అర్బన్) 162, దండేపల్లి 66, హాజీపూర్ 42, జైపూర్ 91, జన్నారం 188, కన్నెపల్లి 25, కాసిపేట 98, కోటపల్లి 44, క్యాతన్‌పల్లి(అర్బన్) 84, లక్సెట్టిపేట 88, లక్సెట్టిపేట(అర్బన్) 128, మంచిర్యాల(అర్బన్) 664, మందమర్రి 91, మందమర్రి(అర్బన్) 155, నస్పూర్(అర్బన్) 169, నెన్నెల 41, తాండూర్ 172, వేమనపల్లి 29 దరఖాస్తులు వచ్చాయి.



జిల్లా మైనార్టీ కార్యాలయం

'కంటి వెలుగు' విజయవంతం చేయండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ఈ నెల 18నుంచి ప్రారంభించే కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర ఔషధ గిడ్డంగి వద్ద శనివారం జిల్లాలోని కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో విజయవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 40 బృందాలకు సంబంధించిన 40 వాహనాలు ఏర్పాటు చేసి, కంటి వెలుగు బ్యానర్లు కట్టారు. 2.40లక్షల కరపత్రాలు, ఆహ్వాన పత్రికలు, 1.20 లక్షల పేషెంట్ల రికార్డు ఫైళ్లు, 40 రోల్ అప్‌స్టాండ్లు, ఏఆర్ మిషన్లను అందించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, మంచిర్యాల, బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ విజయ నిర్మల, విజయపూర్ణిమ, ఆప్తాల్మిక్ అధికారి శంకర్, జిల్లా ఫార్మాసిస్టు శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సామగ్రి పంపిణీ చేస్తున్న డాక్టర్ సుబ్బరాయుడు

పగిలిన గూడెం ఎత్తిపోతల పైప్‌లైన్

- నిలిచిన సాగు నీటి సరఫరా
- పరిశీలించిన బీజేపీ, జలసాధన సమితి నాయకులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం పైపులైన్ శుక్రవారం రాత్రి పగిలిపోయింది. ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌కు కొద్ది దూరంలో పైపులైన్ లీకై పగిలింది. దీంతో సాగునీటి సరఫరా మళ్లీ నిలిచిపోయింది. డిసెంబర్ 29 నుంచి యాసంగి సాగుకు నీరు అందిస్తుండగా అంతరాయం కలగడం ఇది రెండోసారి. పది రోజుల క్రితం చిన్న లీకేజీ, కేబుల్ మార్పిడి కోసం సుమారు వారం రోజులు నిలిపివేశారు. మళ్లీ నీటిసరఫరా నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెంతున్నారు. శనివారం మరమ్మతు పనులు ప్రారంభించారు. కాగా, పైపులైన్ పగిలిన ప్రదేశాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ శనివారం పరిశీలించారు. నాణ్యత పాటించకపోవడం వల్ల పైపులైను పగిలిపోతోందని విమర్శించారు. పార్టీ నాయకులు రాజయ్య, శ్రీనివాస్, పురుషోత్తం, రవిగౌడ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పగిలిన పైప్‌లైన్..

నాసిరకం పైపులు వేయడం వల్లే..

నాసిరకం పైప్‌లు వేయడంతోనే ప్రతియేటా పగిలిపోతున్నాయని జలసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ ఆరోపించారు. పగిలిన పైప్‌లైన్‌ను శనివారం రైతులతో కలిసి పరిశీలించారు. శ్రీరాంసాగర్ నీటితో కడెం ప్రాజెక్టు నింపి ఆయకట్టు చివరిదాకా సాగునీరందించాలని డిమాండ్ చేశారు. నాయకులు చిన్నన్న, తిరుపతి, బుచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గోదారంగనాథస్వామి కల్యాణం



కల్యాణానికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో గోదారంగనాథ స్వామి కల్యాణం శనివారం రాత్రి రమణీయంగా నిర్వహించారు. గోదాదేవి, రంగనాథస్వామి ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన స్వామి కల్యాణానికి పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులతోపాటు ఆలయ ఈవో రవి, అర్చకులు భట్రాచార్య, బాలక్రిష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సందర్శనకు పర్యాటకుల తాకిడి



గొండుగూడ బేస్‌క్యాంపు వద్ద జిల్లా న్యాయమూర్తులు



సఫారీలో ప్రయాణిస్తున్న పర్యాటకులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటనకు పర్యాటకుల తాకిడి పెరిగింది. పండుగ సెలవులు, శని, ఆదివారాలు కావడంతో జన్నారం హరిత రిసార్ట్స్ గదులు పూర్తిగా నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు హరిత రిసార్ట్స్‌లో బస చేసి సఫారీ ద్వారా అడవులకు వెళ్లి అడవి అందాలు, వన్యప్రాణులను తిలకించారు. పర్యాటకులు కుటుంబ సమేతంగా సరదాగా గడిపారు. మంచిర్యాల జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహతి వైష్ణవి, మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఉపనిషద్విని తమ కుటుంబ సమేతంగా సఫారీ ప్రయాణం చేశారు. హైదరాబాద్, కరీంనగర్, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సఫారీ కోసం పర్యాటకులు నిరీక్షించాల్సి వచ్చింది. పర్యాటక శాఖ రెండు, అటవీశాఖ రెండు సఫారీలు ఏర్పాటు చేయగా ప్రయాణానికి పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



శనివారం హైదరాబాద్–మంచిర్యాల ఇంటర్‌సిటీలో రద్దీ



టాయిలెట్ల వరకు నిలబడిన ప్రయాణికులు

చోటే లేదు సీటెక్కడ?

పండుగ రద్దీకి తగినట్లుగా రైళ్లు లేక కిక్కిరిసి ప్రయాణం సాగించాల్సి వస్తోంది. సరిపడా సీట్లు లేక హైదరాబాద్ నుంచే నిలబడి గంటల కొద్దీ ప్రయాణం సాగిస్తున్నారు. మరుగుదొడ్ల దోర్ల వరకు కిక్కిరిసిపోయి నిలబడి ఉండడంతో అత్యవసరానికి వెళ్లాలంటే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. సీట్ల కోసం వాగ్వాదానికి దిగుతున్నారు. గత్యంతరం లేక కొందరు కింద కూర్చున్నారు. పండుగ వేళ స్పెషల్ రైళ్లు నడపాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. తిరుగు ప్రయాణంలోనూ ఈ అవస్థలు తప్పవని హైదరాబాద్ నుంచి మంచిర్యాల వైపు వస్తున్న ప్రయాణికులు 'సాక్షి'తో వాపోయారు. - సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం..



మాట్లాడుతున్న డీఈ, ఏడీఈ

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూస్తామని విద్యుత్ డీఈ కైసర్, ఏడీ ఈ ప్రభాకర్ తెలిపారు. వి ద్యుత్ అంతరాయంతో దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ శివారులో పొలాలు ఎండిపోవడంతో 'పొలాలు బీటలు' అనే శీర్షికన 'సాక్షి'లో శని వారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించా రు. బీటలు వారిన పొలాలను పరిశీలించారు. రైతులు, విద్యు త్ సిబ్బందితో మాట్లాడారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పు డు రైతులు సిబ్బంది దృష్టికి తేవాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏఈఈ రాయనర్సు, లైన్‌మెన్ రామస్వామి, జేఎల్‌ఎం రాజలింగు పాల్గొన్నారు.

16న రాష్ట్ర స్థాయి సమావేశం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం ఈ నెల 16న ఉట్నూర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉన్నత స్థాయి ఉద్యోగులు, హైదరాబాద్, కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగ్, నిజామబాద్, జిల్లాల నుంచి హాజరవుతారని, పర్ధాన్ ఉద్యోగుల సంఘం బలోపేతం చేయడం, భవిష్యత్‌లో సంఘం నిర్వహించే కార్యక్రమాలు, సమాజానికి చేయాల్సిన సేవ వంటి ముఖ్యమైన ఏజెండాతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎదురొస్తున్న ప్రమాదం..!

- ఎదురెదురుగా ఢీకొంటున్న ద్విచక్ర వాహనాలు
- వేగం వల్ల గాల్లో కలుస్తున్న ప్రాణాలు



భీంపూర్ మండలం లక్ష్మీపూర్ వద్ద జరిగిన ప్రమాద స్థలంలో క్షతగాత్రులు(ఫైల్)

సాక్షి, మంచిర్యాలడెస్క్: ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి ప్రమాదం ఎదురొస్తోంది. అతివేగం, మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోవడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. గత డిసెంబర్ 25న ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు సంఘటన స్థలంలోనే మృత్యువాత పడడం, మరొకరు ఆస్పత్రిలో చనిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ప్రమాదాల్లో మృతుల సంఖ్యతోపాటు గాయపడుతున్న వారూ అధికంగానే ఉంటున్నారు.

హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు ఢీకొ న్న ఘటనల్లో చాలామంది హెల్మెట్ లేకపోవడం వ ల్లే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జ రిగింది. రాంగ్‌రూట్‌లో వెళ్లడం, మూలమలుపులు, మద్యపానం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో గత ఏడాది కాలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 3,288మందికి పో లీసులు జరిమానా విధించారు. రూ.4.81లక్షలు జరి మానా రూపంలో వసూలైంది. నిర్మల్ జిల్లాలో హె ల్మెట్ లేకుండా ప్రయాణించిన 1,49,621 మంది కి రూ.2,24,43,150 జరిమానా విధించారు. ఆదిలా బాద్ జిల్లాలో 2,307 మందికి జరిమానా విధించి రూ.1,17,232 వసూలు చేశారు. జిల్లాలో పోలీసులు 13బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. నేరడిగొండ మండలం కుప్టి, నేరడిగొండ సమీపంలోని దాబాల వద్ద, ఇచ్చో డ, ఇంద్రవెల్లి మండలం పులిమడుగు, జైనథ్ మండలం భోరజ్, మావల సమీపంలోని బైపాస్, దేవాపూర్ చెక్‌పోస్టు తదితర ప్రాంతాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు..

- మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై గత జూలై 11న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. హాజీపూర్ గ్రామానికి చెందిన మల్యాల వంశీ(20) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఈ ప్రమాదంలో వంశీ మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇదే ప్రమాదంలో మరో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకులు చింతకింది శ్రీధర్, అలిశెట్టి రవిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందినవారు.
- తాంసి మండలం హస్నాపూర్ గ్రామ సమీపంలో డిసెంబర్ 25న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఘటన స్థలంలోనే నలుగురు మృతిచెందారు.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.. సుజిత్ రామ్(38), మనీషా(11), నారాయణ(30), సంస్కార్(11) మృతిచెందారు. వందన అనే మహిళ గాయపడింది. ఈ ప్రమాదంలో బైక్ ప్రయాణిస్తున్న వారు హెల్మెట్లు ధరించలేదు.
- జనవరి 9న భీంపూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గుబిడిపల్లెకు చెందిన చిర్ర మల్లన్న, రాజారాం, మహారాష్ట్రలోని కొఠారికి చెందిన రంజిత్‌చౌహాన్, రమేష్‌యాదవ్ గాయపడ్డారు.
- జనవరి 9న ముథోల్ మండలం టాక్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన సాయిలు(35) అక్కడికక్కడే మృతిచెందాడు. నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన రాజశేఖర్ గాయపడ్డాడు.
- ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడ సమీపంలో గత ఏడాది ఫిబ్రవరి 28న రెండు ద్విచక్ర వాహనాల ఎదురెదురుగా ఢీకొని గుండవేణి ప్రసాద్ గాయపడ్డాడు. అక్టోబర్ 20న రాంపూర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో కా ల్వ మల్లేష్ గాయపడ్డాడు. మే 20న జరిగిన ప్ర మాదంలో షేక్ ఆరీఫ్(50) మృతిచెందాడు. వీ రి వాహనాలకు ఎదురుగా వాహనాలపై వచ్చి న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
- జనవరి 10న మండల కేంద్రమైన ముధోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాలపై ఎదురెదురుగా వస్తున్న బాసర గ్రామానికి చెందిన శివ తీవ్రంగా, మహారాష్ట్రకు చెందిన సంక్షేణ స్వల్పంగా గాయపడ్డారు.

హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలి



మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు జ రుగుతున్నాయి. యువత చైతన్యంతో నిబంధనలు పాటిస్తేనే ప్ర మాదాలు నివారించవచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మితిమీరిన వేగం, ని బంధనలు పాటించకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే పోలీ సు, రవాణా శాఖల సమన్వయంతో రెడ్ జో న్, బ్లాక్‌స్పాట్స్ గు ర్తించడంతోపాటు మూలమలుపులు, ఇరుకు వంతెనల వద్ద జాగ్రత్తలు సూచించాం. వాహనదారులు జాగ్రత్తలు పా టించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డు ప్ర మాదాలకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో జాగ్రత్తలు సూచించాలి. ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనల్లో హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు పాటించాలి.

– ఎల్.కిష్టయ్య, జిల్లా రవాణాశాఖా అధికారి, మంచిర్యాల

ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ద్విచక్ర వాహనాలతోనే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపిస్తుండడంతో ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో గుర్తించేలా ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల వెనుక రేడియం వేయించేలా చూస్తున్నాం. ఆదిలాబాద్ పట్టణంలో రోడ్లపై పశువుల సంచారంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పది రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతో ప్రమాదాలు జరగడలేదు. నిబంధనలు పాటించని 300 మందిపై కేసులు నమోదు చేశాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలి.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ

మామిడి తోటలను సంరక్షించుకోవాలి



మామిడి తోట



తిరుపతి, హెచ్‌వో

చెన్నూర్‌రూరల్: ప్రతీయేటా అకాల వర్షాలు, వాతావరణ మార్పులతో మామిడి కాయలు నేల రాలడం, కాయలు దెబ్బతిని మామిడి రైతులు తీవ్ర నష్టాలకు గురవుతూనే ఉన్నారు. ప్రకృతి ప్రకోపంతో లక్షల రూపాయలు నష్ట పోతున్నారు. మామిడి తోటల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. లేదంటే కాయలు దెబ్బతిని దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఉదయం, రాత్రివేళల్లో చలి, మధ్యాహ్నం ఎండ అంతా వేడిమి ఉంటుంది. ఎండల బారి నుంచి పండ్ల తోటలను రక్షించుకోవడంపై రైతులు దృష్టి సారించాలని హెచ్‌వో తిరుపతి సూచించారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, గాలిలో తేమ శాతం తగ్గుముఖం పట్టడం వల్ల పండ్ల తోటల్లో కాయలపై పొడలు ఏర్పడి పెరుగుదల తగ్గిపోవడం, నాణ్యత దెబ్బ తినడం జరుగుతుంది. నాణ్యత లోపించిన కాయలకు మార్కెట్‌లో ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి ఎండలు, వేసవిలో పండ్ల తోటల్లో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎండలు పెరిగే కొద్దీ పిందెలు, కాయలపై ప్రభావం ఎక్కువగా పడుతుంది. ఎండ వేడిమికి కాయలు దెబ్బతిని పెరుగుదల, నాణ్యత తగ్గిపోతుంది. ఎండ సోకిన ప్రాంతంలో కాయకు గుంత పడుతుంది. చాలా సందర్భాల్లో 20 నుంచి 30 శాతం వరకు కాయలు ఎండ తీవ్రత వల్ల దెబ్బతింటాయి. ఇందులో బంగినపల్లి, నీలం, తోతాపరి, పలు రకాల కాయలకు ఎండ బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో కాయల్లో లోపలి భాగంలో కోతకు మునుపే మచ్చలు ఏర్పడి లోపలి కణజాలం కుళ్లుతుంది. ఇవి చాలా వరకు రాలి పోతాయి. 20ఏళ్ల లోపు వయస్సున్న తోటల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

నివారణ ఇలా

పిందెలు గోళీ సైజులో ఉన్నప్పుడు ఒకసారి, నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు రెండోసారి లీటరు నీటికి 20 గ్రాముల సున్నం, అర మిల్లీ లీటరు జిగురు కలిపిన ద్రావణాన్ని పిందెలు, కాయలపై సన్నటి పొర ఏర్పడేలా పిచికారీ చేయాలి. ఇలా చేస్తే సరిపోతుంది. రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. కాయల ఎదుగుదల లోపించినా, ఎండ తీవ్రతకు మచ్చలు ఏర్పడి, కాయల్లో ఏమైనా తేడాలు కనిపించిన వెంటనే ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సత్వర నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



పార్వతిబాయిని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ధర్‌లొద్దీ గ్రామానికి చెందిన వివాహిత పార్వతి బాయి(23) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికుల కథనం ప్ర కారం.. పార్వతి బాయి ఇంట్లో ఎవరూ లేని స మయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా ఈఎంటీ కార్తీక్‌సింగ్, పైలేట్ రాములు ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్ ఆసుపత్రికి తరలించా రు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలి యాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వివాహిత బలవన్మరణం



సాయి వినూత్న (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన వివాహిత సాయివినూత్న(22) బలవన్మరణానికి పాల్పడింది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లడ్ కాలనీకి చెందిన సాయి వినూత్నకు దేవాపూర్‌కు చెందిన సాయితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దికాలం తర్వాత భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల అంగీకారంతో గత నవంబర్‌లో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. కొంతకాలంగా సాయి వినూత్న ఇంట్లో ఒంటరిగా, ముభావంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లోని బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి వినోద్‌శర్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం



సర్ఫ్ నీళ్లు తాగిస్తున్న స్థానికులు

భీమారం: మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి చింతపూడి అంజి(20) శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంట్లో గొడవపడి అకస్మాత్తుగా క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు స్పందించి పురుగుల మందు బయటకు వచ్చేలా సర్ఫ్ నీళ్లు తాగించారు. అనంతరం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

బెల్లంపల్లి వాసికి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న కుమారస్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రడగంబాల బస్తీకి చెందిన దుర్గం కుమారస్వామిని ఇంటర్నేషనల్ అకాడమిక్ ఎక్స్‌లెంట్-22 అవార్డు వరించింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కుమారస్వామి ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థులకు అందించిన సేవలు, వివిధ జర్నల్స్‌లో ప్రచురితమైన ఆర్టికల్స్‌కు గాను నీతి అయోగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో అవార్డును ప్ర కటించారు. ఈ మేరకు శుక్రవారం అవార్డు, మెడల్ ను కుమారస్వామి అందుకున్నారు. కుమారస్వామిని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.